# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 4, జూన్ 2026




## ఈనెల 15 నుంచి
# కవిత బాయిబాట

✳ ఆరు రోజుల పాటు సింగరేణి బొగ్గు గనుల ప్రాంతాల్లో పర్యటన

**నస్పూర్, జూన్ 3, ప్రభాతవార్త**

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత ఈనెల 15 నుంచి సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో పర్యటించనున్నారు. ఖబాయిబాట' పేరుతో నిర్వహించే ఈ పర్యటనలో భాగంగా ఆమె అండర్ గ్రౌండ్, ఓపెన్ కాస్ట్ గనుల వద్ద సింగరేణి కార్మికులతో ముఖాముఖ సమావేశాలు నిర్వహిస్తారు. మొదటి విడత కార్యాచరణలో భాగంగా ఆరు రోజుల పాటు ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని వివిధ బొగ్గు గనుల ప్రాంతాల్లో ఈ పర్యటన కొనసాగనుంది. పర్యటన ప్రణాళిక ప్రకారం ఈనెల 15న చెన్నూరు నియోజకవర్గంలోని మందమర్రి ఏరియా బొగ్గు గనుల ప్రాంతంలో కవిత పర్యటిస్తారు. 16న మంచిర్యాల నియోజకవర్గంలోని శ్రీరాంపూర్ ఏరియా, 17న రామగుండం నియోజకవర్గంలోని ఆర్జీ-1 ఏరియా, 18న అదే నియోజకవర్గంలోని ఆర్జీ-2 ఏరియాలో కార్మికులతో సమావేశమవుతారు. 19న మంథని నియోజకవర్గంలోని అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్, ఆర్జీ-3 ఏరియాలో పర్యటన ఉంటుంది. చివరి రోజు ఈనెల 20న భూపాలపల్లి నియోజకవర్గంలోని భూపాలపల్లి ఏరియా అండర్ గ్రౌండ్ గనులు, ఓపెన్ కాస్ట్ గనుల వద్ద కార్మికులను కలిసి సమస్యలను తెలుసుకోనున్నారు.

## రాజకీయ జోక్యంతోనే
# డిపెండెంట్ ఉద్యోగాల నిలిపివేత

✧ మెడికల్ ఫిట్ అయిన వారికీ ఉత్తర్వులు ఇవ్వకపోవడం యాజమాన్య వైఫల్యమే

✧ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య




**నస్పూర్, జూన్ 3, ప్రభాతవార్త**

సింగరేణిలో మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్‌లకు సంవత్సర కాలం గడుస్తున్నా రాజకీయ జోక్యం వల్లే యాజమాన్యం నేటికీ నియామక ఉత్తర్వులు జారీ చేయడం లేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు, వేజ్ బోర్డ్ శాశ్వత సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య విమర్శించారు. శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు, డిపెండెంట్లు ధర్నా నిర్వహించారు. మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు వెంటనే నియామక ఉత్తర్వులు జారీ చేయాలనే డిమాండ్‌తో ఈ నిరసన చేపట్టారు. అనంతరం జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ కు వినతిపత్రం సమర్పించారు. వైద్య పరీక్షల్లో అర్హత సాధించిన 400 మందికి పైగా డిపెండెంట్ ల పోస్టింగ్ లను పెండింగ్‌లో పెట్టడం యాజమాన్య వైఫల్యానికి నిదర్శనమని వాసిరెడ్డి సీతారామయ్య మండిపడ్డారు. దీనివల్ల బాధితులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం ఇప్పటికైనా తక్షణమే స్పందించి ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. నియామకాలు చేపట్టని పక్షంలో రాబోయే రోజుల్లో మిగతా 2లో..

# వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**ఆసిఫాబాద్, జూన్ 3, ప్రభాతవార్త :**

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఆదేశాల మేరకు జిల్లా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిస్థితుల పర్యవేక్షణలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. కంచుకోట, గాంధీ చౌక్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, పైకాజీ నగర్ మీదుగా మెయిన్ రోడ్ వరకు ఫుట్ పెట్రోలింగ్ చేస్తూ భద్రతా పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులను ఆపి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రాణాపాయం ఏర్పడటంతో పాటు కుటుంబ సభ్యులకు తీరని నష్టం కలుగుతుందని తెలిపారు. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాల పాటింపు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించి ప్రయాణం చేస్తున్న వాహనదారులను అభినందిస్తూ బెస్ట్ సిటిజన్స్ ఇన్ ఆసిఫాబాద్"గా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, అసిఫాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, ఇన్స్పెక్టర్లు రమేష్, వేణుగోపాల్, సబ్ ఇన్స్పెక్టర్లు మధుకర్, రవికుమార్, విక్రమ్, మహేందర్, ఉల్లాస్, శ్యామ్ రామ్, మోహన్ కుమార్, తదితరులు, పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.








# ప్రభుత్వ కార్యాలయాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 3, ప్రభాతవార్త :**

జిల్లా కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను బుధవారం జిల్లా కలెక్టర్ కె హరిత ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని నీటి పారుదల కార్యనిర్వాహక ఇంజనీరు కార్యాలయం, పంచాయతీ రాజ్ భవనాల శాఖ సబ్ డివిజన్ కార్యాలయాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిబ్బంది సమయపాలనను పాటించాలన్నారు. నీటి పారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయంలో మాట్లాడుతూ చెరువులు, కాలువల మరమ్మత్తులను త్వరితగతిన చేయాలని, ఎలాంటి ఆటంకం కలగకుండా సాగునీటిని అందించాలని కోరారు. కాలువలలో పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు వచ్చేలా చూడాలని, కాలువల తూముల మరమ్మత్తులు పూర్తి చేయాలన్నారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ తనిఖీలో కార్యాలయాల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







# బెల్లంపల్లిలో రోడ్లన్నీ గుంతలమయం..

## తక్షణ మరమ్మతులు చేయాలంటూ ఎంసిపిఐయు నిరసన

**బెల్లంపల్లి, జూన్ 03, ప్రభాతవార్త**




బెల్లంపల్లి పట్టణంలో ఏరియా ఆసుపత్రి నుండి కొత్త బస్టాండ్ వరకు ఉన్న రహదారి తీవ్రంగా దెబ్బతిని గుంతలమయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించాలంటూ ఎంసిపిఐయు పార్టీ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ రహదారి దుస్థితి కారణంగా ప్రజలు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. గుంతలలో పడి అనేక మంది గాయాల పాలవుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు మరియు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పందించకపోవడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రోడ్లపై మట్టి పేరుకుపోవడం వల్ల వాహనదారులకు చూపు సమస్యలు ఏర్పడి ప్రమాదాల అవకాశాలు పెరిగాయని అన్నారు. దుమ్ము తొలగించేందుకు కొనుగోలు చేసిన యంత్రాన్ని వినియోగించకపోవడంపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే వెంటనే స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, మండల కార్యదర్శి తోగరి రాహుల్, ఖమ్మం శ్రీనివాస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ధరణి ఆపరేటర్ నియామకం ఇంకెప్పుడో..

## - మ్యూటేషన్, వారసత్వ మార్పిడి, పాస్‌బుక్ సవరణలు నిలిచిపోవడంతో ఇబ్బందులు

**చింతలమానేపల్లి, జూన్ 3, ప్రభాతవార్త:**





తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న రైతులు, ప్రజలు, ఆపరేటర్ కొరతతో మూలన పడిన ధరణి సేవలు

మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్ లేకపోవడంతో భూ సంబంధిత పనులు నిలిచి పోతున్నాయి. దీంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చే రైతులు, ప్రజలు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధరణి పోర్టల్ ద్వారా నిర్వహించే భూముల మ్యూటేషన్, వారసత్వ మార్పిడి, పట్టాదారు పాస్‌బుక్ సవరణలు, భూ వివరాల నమోదు, ఇతర ఆన్‌లైన్ సేవలు ఆపరేటర్ కొరత కారణంగా ఆలస్యమవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కార్యాలయానికి పలుమార్లు వచ్చినా పనులు పూర్తికాక నిరాశతో వెనుదిరుగుతున్నారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ రుణాలు, సబ్సిడీలు, ఇతర ప్రభుత్వ పథకాల కోసం అవసరమైన భూ పత్రాలు పొందడంలో ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ప్రజలు వారం రోజులుగా, మరికొందరు నెల రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నామని వాపోతున్నారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని చింతలమానేపల్లి తహసీల్దార్ కార్యాలయానికి వెంటనే ధరణి ఆపరేటర్‌ను నియమించాలని మండల ప్రజలు, రైతు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# అక్రమ కట్టడాల పేరిట రైల్వే అధికారులు కూల్చడం సరికాదు

## - అడ్వకేట్ ఉదయ్ కిరణ్

**తాండూర్, జూన్ 3, ప్రభాతవార్త :**




మండలంలోని రేచిని రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో గల స్టీపిల్ ఇన్ఫ్రా కేర్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన భూమిపై రైల్వే అధికారులు కూల్చివేయడం సరికాదని అడ్వకేట్ ఉదయ్ కిరణ్ అన్నారు. తాండూర్ ప్రెస్ క్లబ్లో బుధవారం ఆయన స్టీఫెన్ ఇన్ఫ్రా కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజర్ కిషోర్ గౌడ్ తో కలిసి విలేకరు సమావేశంలో మాట్లాడారు. ఈ భూమిని స్టీఫెన్ ఇన్ఫ్రా కేర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 2021 లో కొనుగోలు చేసిందన్నారు. భూమికి సంబంధించి రెవెన్యూ రికార్డుల ప్రకారంగాని, మోక పరంగా కానీ, సర్వే హద్దుల ప్రకారం అన్ని విధాలుగా ఈ సంస్థకే పూర్తి హక్కులు ఉన్నాయన్నారు. ఇట్టి భూమిపై గతంలో రైల్వే అధికారులు పంపిన నోటీసుకు పూర్తిస్థాయిలో సమాధానం ఇవ్వడం జరిగిందని అనంతరం కోర్టు ద్వారా కూడా సమాధానం ఇచ్చామన్నారు. అయితే ప్రస్తుతం కేసు కోర్టు పరిధిలో రైల్వే అధికారులు ఎలా కూల్చివేస్తారని ఆయన ప్రశ్నించారు. రైల్వే అధికారులకు రికార్డ్ పరంగా ఏదైనా ఆధారాలు ఉంటే కోర్టుకు సమర్పించాలన్నారు. తమ క్లైంట్ కు చెందిన భూ హద్దులు, కట్టడాలు తొలగించడంపై కోర్టుకు ఫిర్యాదు చేస్తామన్నారు. బెల్లంపల్లి రైల్వే ఇంజనీరింగ్ అధికారులపై, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే సిబ్బందిపై తాండూర్ పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేసామన్నారు. తదుపరి కోర్టు ఉత్తర్వులు వచ్చేంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టిన తాము చట్టపరంగా ముందుకు వెళ్తామని అన్నారు.

## రాజకీయ జోక్యంతోనే

# డిపెండెంట్ ఉద్యోగాల నిలిపివేత

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీ సైదా, ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, యూనియన్ నాయకులు నాగభూషణం, అఫ్రోజ్ ఖాన్, గునిగంటి నర్సింగరావు, నాగేశ్వరరావు, రమేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో డిపెండెంట్లు పాల్గొని ధర్నాను విజయవంతం చేశారు.



# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఏర్పాట్లు పూర్తి

## - జూన్ 5న కాగజ్‌నగర్‌లో జిల్లా స్థాయి పోటీలు

## - రాష్ట్ర స్థాయికి ఎంపికకు అవకాశం

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 3, ప్రభాతవార్త :**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ముత్తు బాక్సింగ్ క్లబ్ నిర్వహణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 2026 పోటీలు జూన్ 5న సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని బాలభారతి హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో బాలురు, బాలికలు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కబ్ బాక్సింగ్ విభాగంలో 2014, 2015, 2016 సంవత్సరాల్లో జన్మించిన వారు, సబ్ జూనియర్ విభాగంలో 2012, 2013 సంవత్సరాల్లో జన్మించిన వారు, జూనియర్ విభాగంలో 2010, 2011 సంవత్సరాల్లో జన్మించిన వారు అర్హులని వెల్లడించారు. జిల్లా స్థాయి ఎంపికల్లో అండర్15 విభాగానికి ఎంపికైన క్రీడాకారులు తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూన్ 12, 13 తేదీల్లో హైదరాబాద్‌లోని ఉప్పుగూడ నరేంద్ర స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అవకాశం పొందనున్నారని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు ముందస్తుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాల కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం. శేఖర్ (9177112942) ను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం. శేఖర్, అధ్యక్షులు ఎం. విజేందర్, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వి. మధు, చైర్మన్ శివకుమార్ నాయర్ తదితరులు క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

## - లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి

**నస్పూర్, జూన్ 3, ప్రభాతవార్త**

గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీఐ) మంచిర్యాల శాఖ ఆధ్వర్యంలో జూట్ బ్యాగుల తయారీపై అందిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి అన్నారు. బుధవారం ఆర్‌సెటీఐ మంచిర్యాల లో ఏర్పాటు చేసిన 14 రోజుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా వయోజన విద్యా కార్యక్రమ అధికారి శ్రీనివాస్, ఆర్‌సెటీఐ సంచాలకులు ఆశిష్ వార్లే, కార్మల్ పాఠశాల ప్రిన్సిపల్ సారూప్యలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూట్ ఉత్పత్తుల రంగంలో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని, ఆర్‌సెటీఐ ప్రత్యేక శిక్షకుల ద్వారా జూట్ బ్యాగుల తయారీకి సంబంధించిన సాంకేతిక అంశాలు, నాణ్యత ప్రమాణాలు, ముడి పదార్థాల ఎంపిక, ఉత్పత్తి ప్రక్రియ తదితర అంశాలపై శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు, మార్కెటింగ్ టెక్నిక్స్, వ్యాపార నిర్వహణ, వ్యక్తిత్వ వికాసం, ఇతర నైపుణ్యాభివృద్ధి అంశాలపై కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తైన అనంతరం స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవాలనుకునే అభ్యర్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు, అర్హులైన వారికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పించి ఆర్థిక అభివృద్ధికి సహకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**- అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య ఆదేశం**

**బెల్లంపల్లి, జూన్ 03, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపాలిటీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బుధవారం మండల తహసిల్దార్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వాతి రమేష్ బాబు, కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి పట్టణంలోని పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న పనుల పురోగతిని సమీక్షించిన అదనపు కలెక్టర్, పనులు నత్తనడకన సాగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు, గుత్తేదారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని, ప్రజలకు మౌలిక సదుపాయాలు త్వరగా అందేలా కృషి చేయాలని ఆదేశించారు. పట్టణంలో ప్రతిపాదిత నూతన డంపింగ్ యార్డ్ స్థలాన్ని పరిశీలించి, ఘన వ్యర్థాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, భూ లభ్యత, పర్యావరణ ప్రమాణాల అమలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆధునిక వ్యర్థాల నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేసి పట్టణ పరిశుభ్రతను మెరుగుపర్చాలని పేర్కొన్నారు. అనంతరం ఫుడ్ ప్రాసెసింగ్ జోన్, పాత డంపింగ్ యార్డ్‌ను సందర్శించి భూసంబంధిత సమస్యలు, నిర్వహణ పరిస్థితులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. మార్కెట్ యార్డ్ పరిధిలో ఉన్న ఆక్రమణలను పరిశీలించిన ఆయన, ప్రజా అవసరాలకు సంబంధించిన స్థలాలను ఆక్రమణల నుండి విముక్తం చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చట్టపరమైన చర్యలతో సమస్యను పరిష్కరించాలని సూచించారు. అలాగే పట్టణ అభివృద్ధికి



ఆటంకం కలిగించే అంశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి, లబ్ధిదారులకు మంజూరైన బిల్లుల చెల్లింపులు, నిర్మాణ పురోగతి, ఎదురవుతున్న సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులు నివాసంలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్ఓ) హోదాలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సేవలు ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎన్నికల పర్యవేక్షకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఓటరు జాబితాల నిర్వహణ, దరఖాస్తుల పరిష్కారం, ఎన్నికల విధుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ సిబ్బంది, ఎన్నికల పర్యవేక్షకులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెబుతున్న ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

**భైంసా, జూన్ 03, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని హంపోలి(కె), బోరెగాం గ్రామాల్లో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన వారి బాధిత కుటుంబాలను ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాధిత కుటుంబ సభ్యులను నేరుగా కలిసి వారి ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ కష్టకాలంలో తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## పలు కుటుంబాలను పరామర్శించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, జూన్ 04, ప్రభాతవార్త:**

నెరడిగొండ మండలంలోని తేజాపూర్ గ్రామానికి చెందిన వాంకిడి పోతారెడ్డి మాతృమూర్తి, అలాగే గడ్డం రమణ రెడ్డి మాతృమూర్తి ఇటీవలే మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం తేజాపూర్ గ్రామాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నవీన్, శ్రీకాంత్ రెడ్డి, పద్మనాభ రెడ్డి, శోభన్ రెడ్డి, లక్ష్మణ్, విద్యాసాగర్ రెడ్డి, ప్రదీప్, లడ్డు, పోతారెడ్డి, రవీందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## డీఎల్వీఎంసీ కమిటీలో నాన్‌అఫీషియల్ సభ్యుల నియామకం

**- జూన్ 20 వరకు దరఖాస్తుల ఆహ్వానం**

**నిర్మల్, జూన్ 04, ప్రభాతవార్త:**

జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ (డీఎల్వీఎంసీ)ని పీసీఆర్/పీఓఏ చట్టం కింద పునర్వ్యవస్థీకరించేందుకు ఎనిమిది మంది నాన్ అఫీషియల్ సభ్యుల నియామకానికి జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. లేఖ నంబర్ ఎ1/155/2026 ద్వారా జారీ చేసిన పత్రికా ప్రకటన ప్రకారం, ఎస్సీ/ఎస్టీ కమ్యూనిటీల నుంచి ఐదుగురు, స్వచ్ఛంద సంస్థల (ఎన్‌జీఓ)తో అనుబంధం ఉన్న ఇతర వర్గాల నుంచి ముగ్గురు సభ్యులను ఎంపిక చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం క్షేత్రస్థాయిలో సేవలందించిన వారికి ఈ నియామకాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు సామాజిక సేవకు సంబంధించిన పూర్తి వివరాలను జతచేసి ఈ నెల 20వ తేదీ సాయంత్రంలోగా జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం, నిర్మల్‌లో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. పీసీఆర్/పీఓఏ చట్టం అమలును పటిష్టంగా పర్యవేక్షించేందుకు, ఈ కమిటీలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకే నాన్‌అఫీషియల్ సభ్యులను నియమిస్తున్నట్లు కలెక్టర్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.



## విత్తనాల దుకాణాలలో అధికారుల తనిఖీ

**తాండూర్, జూన్ 3, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను బుధవారం టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, బెల్లంపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజనరేందర్, మండల వ్యవసాయ అధికారి సుష్మ, పోలీసులు దుకాణంలోని విత్తనాలు, రికార్డులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు రసీదులు ఇవ్వాలని దుకాణ యజమానులకు సూచించారు.

## బాధ్యతలు స్వీకరించిన బెల్లంపల్లి ఏరియా జిఎం

**తాండూర్, జూన్ 3, ప్రభాతవార్త :**

బెల్లంపల్లి ఏరియా నూతన జనరల్ మేనేజర్ గా శ్రీరమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ జిఎం గా పని చేసిన విజయభాస్కర్ రెడ్డి పదవి విరమణ చేశారు. దీంతో మణుగురు ఏరియా నుండి బెల్లంపల్లికి బదిలీ పై వచ్చిన ఆయనకు ఏరియా అధికారులు స్వాగతం పలికారు. నూతన జిఎంను శాలువాతో సన్మానించి పూల మొక్కలను బహుకరించారు. నూతన జిఎం మాట్లాడుతూ గతంలో బెల్లంపల్లి ఏరియాలో పని చేసిన అనుభవం ఉందన్నారు. ఏరియాలోని అన్ని విభాగాలను సందర్శించి అధికారులు, కార్మికుల సహకారంతో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతకు లక్ష్యసాధనకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కైరిగూడ పివో నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి, ఇంచార్జి ఎస్ఓ టు జిఎం ఉమాకాంత్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.






## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

**తాండూర్, జూన్ 3, ప్రభాతవార్త :**

ఈనెల 7న బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించనున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రాజారం కోరారు. కొత్తపల్లి గ్రామంలో సిఐటియు నాయకులు, కార్మికులు మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజారాం మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికుల సమస్యలు, వివిధ అంశాలపై ప్రతినిధులు చర్చించి భవిష్యత్ ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు తీర్మానాలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పట్నపురి నాగయ్య, లచ్చక్క, తుంగెడపోసు, నాయిని నారాయణ, లక్ష్మి, కోయ లక్ష్మి, కమ్మరి రోజా, చింతకుంట్ల లచ్చయ్య, సిహెచ్ శైలు పాల్గొన్నారు.




## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**- మాదారం డిఆర్ఓ గౌరీ శంకర్**

**తాండూర్, జూన్ 3, ప్రభాతవార్త :**

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మాదారం డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి (డిఆర్ వో) గౌరీ శంకర్ అన్నారు. మాదారం 3 ఇంక్లైన్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధ వారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు అడవులను కాపాడటం, పర్యావరణాన్ని సంరక్షించడం బాధ్యత గా తీసుకోవాలనీ, మనం వాటిని కాపాడితే అవి మనల్ని కాపాడుతాయన్నారు. చెట్ల ప్రాముఖ్యత, వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి కుమార్, బీట్ ఆఫీసర్లు రాజమణి, గోపిక్రిష్ణ, అనిమల్ ట్రాకర్ సమ్మయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, జూన్ 3, ప్రభాతవార్త**



రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలంలోని ఓం రైస్ మిల్, బెజ్జాల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, అన్నపూర్ణ రైస్ మిల్, కిష్టాపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, సుముఖ గోదాంలను మండల తహసిల్దార్ వనజా రెడ్డితో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు, దిగుమతి ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సంవత్సరం దాదాపు 1 లక్ష 60 వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. హమాలీల సమస్యను అధిగమించేందుకు స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెద్దపల్లి, కరీంనగర్‌లలో హమాలీలతో కలిపి 2 గోదాములను ఇచ్చారని, అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలుగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈసారి ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్లను సైతం వినియోగించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, నిర్దేశిత సి.ఎం.ఆర్. లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## పోలీసు బందోబస్తు మధ్య జెసిబిలతో కట్టడాల కూల్చివేత

**- భూమిని స్వాధీనం చేసుకున్న రైల్వే అధికారులు**

**తాండూర్, జూన్ 3, ప్రభాతవార్త :**

మండలంలోని రేచిని రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో గల అక్రమ కట్టడాలను సంబంధిత రైల్వే ఇంజనీరింగ్ అధికారులు కూల్చి వేయించి, భూమిని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఉదయం రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్, తాండూర్, బెల్లంపల్లి సివిల్ పోలీసు బందోబస్తు మధ్య రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది అక్రమ కట్టడాల వద్దకు చేరుకున్నారు. రైల్వే భూమిలో నిర్మించిన కాంపౌండ్ వాల్స్, కట్టడాలను జెసిబిలతో సంబంధింత రైల్వే అధికారులు కూల్చి వేయించారు. మండలంలో కూల్చివేతలు చర్చనీయాంశంగా మారాయి. తాండూర్ సీఐ దేవయ్య, తాండూర్, తాళ్ల గురజాల ఎస్సైలు ప్రసాదరావు, రామకృష్ణ బందోబస్తు నిర్వహించారు

## బెల్లంపల్లి ఏరియా నూతన జిఎంగా ఎం. శ్రీరమేష్ బాధ్యతల స్వీకరణ

**బెల్లంపల్లి, జూన్ 03, ప్రభాతవార్త**




బెల్లంపల్లి ఏరియా నూతన జనరల్ మేనేజర్ గా ఎం. శ్రీరమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మణుగూర్ ఏరియా నుండి బదిలీపై వచ్చిన ఆయనకు బెల్లంపల్లి ఏరియా అధికారులు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సన్మానించి పూల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్ మాట్లాడుతూ గతంలో ఈ ఏరియాలో పనిచేసిన అనుభవం తనకు ఉన్నదని తెలిపారు. ఏరియాలోని అన్ని విభాగాలు, గనులను త్వరలో సందర్శించి, పనితీరును సమీక్షిస్తానని చెప్పారు. సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షుడు, ఖైరిగూడ పీవో మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణమూర్తి, ఇంచార్జ్ ఎస్ఓటు జిఎం ఎన్. ఉమాకాంత్‌తో పాటు వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



## హరీష్ రావు జన్మదిన వేడుకల్లో భాగంగా గర్భిణీలకు పండ్ల పంపిణీ

**వేమనపల్లి, జూన్ 03, ప్రభాతవార్త**

మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం వేమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హరీష్ రావు అభిమానులు గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణీలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సమాజ సేవా కార్యక్రమాల ద్వారా హరీష్ రావు జన్మదినాన్ని ప్రత్యేకంగా నిర్వహించడం ఆనందంగా ఉందని అభిమానులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అభిమానులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బెల్లంపల్లి సింగరేణిలో కార్మిక సమస్యలపై మెమోరాండం

**- పరిష్కారానికి చర్యలు కోరిన సంఘం నాయకులు**

**బెల్లంపల్లి, జూన్ 03, ప్రభాతవార్త**



తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బెల్లంపల్లి సింగరేణి ఏరియాలో కార్మికుల పలు కీలక సమస్యల పరిష్కారం కోసం సంఘ నాయకులు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా డివైసీ సీఎంఓ పాండు రంగచారి కి మెమోరాండం సమర్పిస్తూ, సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా ఏరియా ఆసుపత్రిలో రెగ్యులర్ మెడికల్ బోర్డు నిర్వహణ జరగకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా డిస్మిస్డ్ కార్మికులకు మానవతా దృక్పథంతో మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. ప్రతి కార్మికుడి సొంతింటి కలను సాకారం చేసే దిశగా 250 గజాల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇక మారుపేరుల సమస్యలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. సింగరేణి కొత్త గనులను నేరుగా స్థానిక కార్మికులకు కేటాయించడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఈ అన్ని అంశాలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం పిట్ సెక్రటరీ ఈర్ల ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో ఏరియా నాయకులు అనుముల సత్యనారాయణ, అసిస్టెంట్ సెక్రటరీలు స్టాఫ్ నర్స్ రస రజిని, ఎం.డి. రావుఫ్, బోగి శ్రీనివాస్, గోమాస తిరుపతి, సింగతి రాజేందర్, అహ్మద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కాలేజీల్లో సీట్లకు దరఖాస్తుల గడువు రేపటితో ముగింపు

**నిర్మల్, జూన్ 03, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లాలో 202627 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే గడువు జూన్ 5తో ముగియనుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి టి. దయానంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు మరియు ప్రభుత్వ వసతి గృహాల్లో (హాస్టల్స్) చదివి, ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో 7.0 జీపీఏ లేదా 400కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు నియోజకవర్గాల వారీగా కేటాయించిన సీట్ల కోసం వెబ్‌సైట్ ద్వారా జూన్ 5, 2026లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్.సి. నంబర్ బీ1/178/2026, తేదీ 03062026 ద్వారా ఈ నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించరని స్పష్టం చేశారు.

## వ్యక్తి ఆత్మహత్య

**స్యారంగాపూర్, జూన్ 03, ప్రభాతవార్త:**



మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన దేశెట్టి సాయన్న (51) ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు. సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూరు గ్రామానికి చెందిన దేశెట్టి సాయన్న గత కొన్ని సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతున్నారు. ఆయన భార్య రెండేళ్ల క్రితం చనిపోవడంతో సాయన్న ఒంటరిగా ఉంటున్నారు. తీవ్ర అనారోగ్యం, తోడుగా ఒంటరితనం వేధించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన సాయన్న గత నెల 27వ తేదీన తన ఇంట్లో గడ్డి మందు (పురుగుల మందు) తాగారు. గమనించిన స్థానికులు, బంధువులు చికిత్స నిమిత్తం ఆయనను భైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి సాయన్న మృతి చెందారు. మృతుడికి ఒక కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొడుకు ఉపాధి కోసం దుబాయ్‌లో ఉంటుండగా, ఇద్దరు కుమార్తెలకు వివాహాలు జరిగాయి. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక వార్డు సభలు

**- ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు శ్రీకారం**

**మందమర్రి, జూన్ 3, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక వార్డు సభలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడం, స్థానిక సమస్యలను గుర్తించడం, ప్రజల సూచనలు, అభిప్రాయాలు మరియు అవసరాలను తెలుసుకుని భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులను నాలుగు విడతలుగా విభజించి ప్రత్యేక వార్డు సభలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

వార్డు సభల షెడ్యూల్:

04062026: వార్డులు 1 నుండి 6 వరకు - ఉదయం 9.00 గంటల నుంచి 11.00 గంటల వరకు

06062026: వార్డులు 7 నుండి 12 వరకు - ఉదయం 9.00 గంటల నుంచి 11.00 గంటల వరకు

08062026: వార్డులు 13 నుండి 18 వరకు - ఉదయం 9.00 గంటల నుంచి 11.00 గంటల వరకు

10062026: వార్డులు 19 నుండి 24 వరకు - ఉదయం 9.00 గంటల నుంచి 11.00 గంటల వరకు

ఈ సమావేశాలలో ఆయా వార్డుల అభివృద్ధి పనులు, తాగునీరు, పారిశుద్ధం, రోడ్లు, వీధి దీపాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజల అభిప్రాయాలు సేకరించనున్నట్లు తెలిపారు. కావున ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ సూచనలు, అభిప్రాయాలు తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రజా అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించేందుకు ఈ వార్డు సభలు వేదికగా నిలుస్తాయని ఆయన తెలిపారు.

# ప్రైవేట్ పాఠశాలలపై నిఘా కమిటీలు ఏర్పాటు చేయాలి

### - డీఈఓకు కలాం గుణం సొసైటీ వినతి

**నిర్మల్, జూన్ 03, ప్రభాతవార్త:**

ప్రైవేట్ పాఠశాలల ఫీజులు, నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీ విక్రయాల నియంత్రణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు సొసైటీ ప్రతినిధులు జిల్లా విద్యాశాఖాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు యూనిఫాం, నోట్‌బుక్స్, స్టేషనరీ పేరుతో మార్కెట్ ధరల కంటే 75 శాతం అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్రంగా దోచుకుంటున్నాయని ఆరోపించారు. నిర్మల్‌లోని కొన్ని పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా తమకు నచ్చిన సమయపాలనతో నడుస్తూ విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయని, దీనివల్ల పిల్లలు మానసిక సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజుల నియంత్రణ లేకపోవడంతో పాటు పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించడం లేదని ఫిర్యాదు చేశారు. భైంసా, ముధోల్, ఖానాపూర్ పట్టణాలతో పాటు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వందలాది ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నడుస్తున్నాయని, తగిన అనుమతులు లేని విద్యాసంస్థలను తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేశారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ నిరంతరం నిఘా పెట్టాలన్నారు. జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు, విద్యావంతులు, మేధావులతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా, నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేకపోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లో సైతం కొందరు ఉపాధ్యాయులు పాఠశాల సమయాల్లో బయట సంచరిస్తున్నారని, వారి పనితీరుపై జిల్లా కలెక్టర్, డీఈఓ నిత్యం పర్యవేక్షణ చేపట్టాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలాం గుణం సొసైటీ జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ చాంద్ పాషా, గౌరవ అధ్యక్షులు మొహమ్మద్ అబ్దుల్ ఖదీర్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇంతియాజ్, పట్టణ ప్రధాన కార్యదర్శి శేఖ్ ఇంతియాజ్, మహమ్మద్ జుబేర్ హుస్సేన్ ఖాన్, మహమ్మద్ మసూద్ ఖాన్, సయ్యద్ ఇబ్రహీం, మహమ్మద్ కరీం తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కలాం గుణం సొసైటీ జిల్లా బాధ్యులు



## ఉపాధి హామీలో పానది రోడ్ల నిర్మాణం చేపట్టండి

### - ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**భైంసా, జూన్ 03, ప్రభాతవార్త:**

ఉపాధి హామీ పథకంలో పానది రోడ్ల నిర్మాణం చేపట్టాలని పలుమార్లు సూచించినప్పటికీ అధికారులు నిరక్ష్యం ప్రదర్శించడం సరికాదని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ అన్నారు. బుధవారం ముధోల్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అన్ని మండలాల ఉపాధి హామీ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ ప్రతి మండలానికి పానది రోడ్ల నిర్మాణం కోసం కోట్లాది రూపాయల నిధులు మంజూరైనప్పటికీ, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు నిరక్ష ్యంగా వ్యవహరించడం వల్ల పనులు ముందుకు సాగడం లేదని మండిపడ్డారు. వర్షాకాలం ప్రారంభమవుతుండటంతో రోడ్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాల నుండి పానది రోడ్లపై దృష్టి పెడితే కేవలం 25 శాతం పనులు మాత్రమే పూర్తి కావడంపై అధికారుల తీరును తప్పుపట్టారు. రాబోయే 15 రోజుల్లోగా ఉపాధి హామీ గ్రావెల్ రోడ్ల పనులను యుద్ధప్రతిపాదికన వేగవంతం చేయాలని ఆదేశించారు. కొన్ని మండలాల్లోని గ్రామాల్లో తాను స్వయంగా రైతులకు వివరించి చెప్పి రోడ్ల పనులను పూర్తి చేయించానని, ఆయా ప్రాంతాల్లో బాధ్యతగా పనిచేసిన అధికారులను అభినందించారు. గ్రామీణాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తోందని గుర్తుచేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్ని పనులు పూర్తయ్యాయి, మిగిలిన పనుల పరిస్థితి ఏంటనే అంశాలపై పూర్తి సమగ్ర నివేదికను తనకు అందజేయాలని అధికారులను సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ పీడీ విజయలక్ష్మి, వివిధ మండలాల ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

### - ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ఎంపీడీవో, సర్పంచ్

**మందమర్రి, జూన్ 3, ప్రభాతవార్త**

తెలంగాణ ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ద్వారా నిర్మించిన ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాలు మందమర్రి మండలం పొన్నారం గ్రామపంచాయతీలో మంగళవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. లబ్ధిదారుల ఆనందోత్సాహాల మధ్య జరిగిన ఈ కార్యక్రమానికి మందమర్రి మండల ఎంపీడీవో రాజేశ్వరరావు, పొన్నారం గ్రామ సర్పంచ్ పెంచల మధు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన ఇళ్లను పరిశీలించిన అధికారులు, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పేద కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కలుగుతోందని పేర్కొన్నారు. మండల ఎంపీడీవో రాజేశ్వరరావు మాట్లాడుతూ, నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ పెంచల మధు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధితో పాటు పేద ప్రజల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు తమకు సొంతింటి కల నెరవేరడంతో ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





వినతిపత్రం అందజేస్తున్న టీయువీ నాయకులు

## అర్హులైన ఉద్యమకారులకు ఇండ్ల స్థలాలు, పెన్షన్ ఇవ్వాలి

**చింతలమానేపల్లి, జూన్ 3, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు లెక్కచేయకుండా పోరాడి, జైలు జీవితం గడిపిన ఉద్యమకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టీయువీ) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్ దౌలత్‌కు టీ.యు.వి మండల అధ్యక్షుడు కుకుడ్కార్ రమేష్ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడంలో నిరక్ష్యం వహించిందని ఆరోపించారు. రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినందున, గత ఎన్నికల హామీల ప్రకారం ఉద్యమకారులందరినీ గుర్తించి న్యాయం చేయాలని కోరారు. తక్షణమే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్ల స్థలాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నెలకు పెన్షన్ అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నిష్ఠురి సత్యన్న, గౌరవ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, ముఖ్య సలహాదారు బల్దార్పు రాజయ్య, ప్రధాన కార్యదర్శి జగదీష్ తీవారి, కార్యదర్శులు తెలంగాణ శ్రీను, రౌతు శంకర్ తదితరులు పాల్గొన్నారు.


## ఈనెల 7న తెలంగాణ ఉద్యమకారుల సమావేశం

**తాండూర్, జూన్ 3, ప్రభాతవార్త :**

ఈనెల 7న తాండూర్ మండలం ఐబిలో మధ్యాహ్నం 12 గంటలకు తెలంగాణ ఉద్యమకారుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల వేదిక మండల అధ్యక్షుడు చెప్యాల నిరంజన్ రావు ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ శంకర్ గౌడ్, జిల్లా ఇన్చార్జ్ కిషన్ రావు, జిల్లా అధ్యక్షులు రాజేశం హాజరవుతారని తెలిపారు. మండలంలోని తెలంగాణ ఉద్యమకారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ విద్యా సంస్థలలో ప్రవేశాలు పెంచాలి

**ఆసిఫాబాద్, జూన్ 3, ప్రభాతవార్త :**



ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలలో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి దేవసేన, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలో శత శాతం సీట్ల భర్తీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు. 202627 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ విద్యా సంస్థలలో ఉపాధ్యాయుల అవకాశాలు ఉన్న కోర్సులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అధికారులు ప్రభుత్వ కళాశాలలు బలోపేతం కొరకు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కొరకు చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థుల సంఖ్య శత శాతం ఉండేలా ఉపాధ్యాయుల సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన, విద్యాధికారులతో సమీక్ష, బడిబాట కార్యక్రమాల ద్వారా విద్యార్థుల నమోదు పెంపొందించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషక విలువలు కలిగిన రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, మాధ్యమిక విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

